క్లుప్తంగా

గృహలక్ష్మికి అర్హులను గుర్తించాలి


ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్న కమీషనర్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకానికి అర్హులను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అధికారులకు సూచించారు. బుధవారం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన విచారణ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం ఉండి ఆర్థిక స్థోమత లేని నిరుపేదలను గుర్తించాలన్నారు. ఎంపిక ప్రకియ పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.

ఊపందుకున్న సర్వే

వీర్నపల్లి: మండలంలోని 17 గ్రామాల్లో గృహలక్ష్మి పథకం కింద 1,145 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో బంగారి నరేశ్‌కుమార్ అన్నారు. గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తులపై మండలంలో సోమవారం నుంచి సంబంధిత అధికారులు విచారణ చేట్టారు. అన్ని గ్రామాల్లో కార్యదర్శులతో క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. వీటిలో అర్హులైన వారి జాబితాను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విచారణ కమిటీ సభ్యులు డీటీ ఎలుసాని ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతో మానసిక ప్రశాంతత


ప్రవచనం చేస్తున్న నరసింహమూర్తి

ఎల్లారెడ్డిపేట: భగవంతుని నామస్మరణతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని త్రిగుళ్ల నరసింహమూర్తిశర్మ అన్నారు. అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డిపేట శివారులోని సత్సంగ సదనంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ప్రవచనాలు వినిపించారు. రామనామం జపిస్తూ హనుమంతుడు సముద్రాన్ని దాటి లంకానగరం చేరాడని, హరినామ సంకీర్తన చేసిన ప్రహ్లాదున్ని ఎన్ని బాధలు పెట్టినా ఏ హాని జరుగలేదన్నారు. భగవంతుణ్ని స్మరించుకునేందుకు ఎలాంటి నియమాలు లేవని.. ఎప్పుడైనా.. ఎక్కడైనా స్మరించుకోవచ్చని వివరించా రు. బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సీఎం మంజూరు చేసినా..!?

ముస్తాబాద్: ఓ గ్రామ అభివృద్ధి కోసం సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా నిధులు మంజూరు చేసినా ఆ పనులకు మోక్షం లభించడం లేదు. ముస్తాబాద్ మండలం గూడూరు సీఎం కేసీఆర్ చిన్నప్పుడు తన సోదరి ఇంట్లో ఉండి చదువుకున్న ఊరు. నాటి జ్ఞాపకాలను నేమరువేసుకుంటూ 2019 జూలైలో రూ.కోటి మంజూరు చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా సీఎంఎస్ఎస్ నిధులు కలుపుకుని పంచాయతీరాజ్ శాఖ ద్వారా 15 పనులకు అధికారులు ప్రొసీడింగ్ కూడా ఇచ్చారు. ఆ పనులకు మంత్రి కేటీఆర్ చేత 2022 ఫిబ్రవరి 14న శంకుస్థాపన చేయించారు. ఆ పనులకు శంకుస్థాపన చేసేందుకు కూడా రెండున్నరేళ్లు పట్టిందంటే అధికారులు ఎంత ఉదాసీనంగా ఉన్నారో తెలిసిపోతుంది. ఇలా అడుగడుగున అవాంతరాల నడుమ మొదలైన పనులు ఇప్పటికీ పూర్తికావడం లేదు.


అసంపూర్తిగా మోడల్ పంచాయతీ భవన నిర్మాణ పనులు

- నాలుగేళ్లుగా అభివృద్ధి పనుల్లో జాప్యం
- నిధులు పుష్కలంగా ఉన్న నత్తనడకన గూడూరు గ్రామ అభివృద్ధి
- బిల్లులు రాకపోవడమా.. అధికారుల నిర్లక్ష్యమా.?

గూడూరులో చేపట్టిన పనులు ఇవే..

➡ రూ.50 లక్షలతో మోడల్ పంచాయతీ భవనం,
➡ రూ. 5 లక్షలతో ప్రాథమిక పాఠశాలలో లైబ్రరీ కోసం అదనపు గది నిర్మాణానికి రూ.5 లక్షలు, కంప్యూటర్ ల్యాబ్ కోసం రూ.5 లక్షలు,
➡ బతుకమ్మ ఘాటు నిర్మాణానికి రూ.5 లక్షలు,
➡ ధ్యాన మందిర నిర్మాణానికి రూ.3 లక్షలు,
➡ గ్రామానికి రెండు వైపుల స్వాగత తోరణాలకు రూ.6 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు,
➡ మురుగు నీటి కాల్వల నిర్మాణానికి రూ.5 లక్షలు,
➡ ఓపెన్ జిమ్‌కు రూ.5 లక్షలు,
➡ సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.2 లక్షలు,
➡ నాలుగు కూడళ్లలో హైమాస్ట్ లైట్లకు రూ.6 లక్షలు,
➡ మైక్‌సెట్‌కు రూ.లక్ష కేటాయించారు.

వీటిలో మోడల్ పంచాయతీ భవనం పనులు 50 శాతం పూర్తి చేయగా, పాఠశాలలో కంప్యూటర్, లైబ్రరీ గదుల పనులు ఇప్పటికీ మొదలు పెట్టలేదు. ఇక హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలు, సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు.

సీఎం హామీ.. నెరవేరదేమీ?

ఎస్‌డీఎఫ్ ద్వారా పంచాయతీరాజ్ శాఖ అధికారులు చేపట్టిన పనులు చాలా ఆలస్యంగా ప్రారంభించారు. ఎస్టిమేషన్లు, తీర్మాణాలు, ఏ పనులు చేపట్టాలనే విషయంలో కొంత ఆలస్యం జరిగితే, పూర్తి చేసిన పనుల్లో హైమాస్ట్ లైట్ల బిల్లులు మినహా ఇతర పనుల బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోడల్ పంచాయతీ భవనం రూ.50 లక్షలతో సర్పంచ్ ప్రత్యేక చాంబర్, అధికారుల చాంబర్, స్టోర్ రూం, సమావేశ మందిరం, మహిళా ఐకేపీ భవనం, ఏఎన్‌ఎం గది, బిల్ కలెక్టర్ రూం, కంప్యూటర్ రూం, విశ్రాంతి గది నిర్మిస్తున్నారు. వీటిలో 50 శాతానికి పైగా పనులు చేపట్టిన ఒక్క బిల్లు కూడా ఇవ్వలేదని కాంట్రాక్టర్ అంటున్నారు. ఏడాదిన్నరగా పనులు చేశామని, ఎంబీ రికార్డులు సైతం చేశామని, ఒక్క బిల్లు రాకుండా పనులు ఎలా పూర్తిచేసేదని అంటున్నారు. దీంతో స్కూల్ లైబ్రరీ, కంప్యూటర్ రూం నిర్మాణం పనులు ప్రారంభించ లేదు.

అధికారులు మోకాలడ్డుతున్నారు



సీఎం కేసీఆర్ గూడూరుతో ఉన్న అనుబంధంతో అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే అధికారులు మోకాలడ్డుతున్నారు. పనులు చేసిన బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. మంత్రి కేటీఆర్, ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన బిల్లులు రాలేదు. మా హయాంలో పనులు పూర్తిచేయాలన్న సంకల్పం మాకుంది. సీఎం పేరును నిలబెట్టాలి.

– చాకలి రమేశ్, సర్పంచ్, గూడూరు

సీఎంకు రుణపడి ఉంటాం



గూడూరు అభివృద్ధికి రూ.కోటి అందించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి వుంటాం. కానీ అధికారుల తీరుతో బిల్లులు అందక పనులు నిలిచిపోయాయి. నాలుగేళ్ల కిందట సీఎం పనులు మంజూరు చేస్తే, ఇప్పటికి పనులు పూర్తిచేయకపోవడం సరైందికాదు. పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియక ముందే పనులు పూర్తిచేయాలి.

– చెక్కపల్లి శ్రీనివాస్, గూడూరు

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం



ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులకు ఎంబీ రికార్డులు పూర్తి చేశాం. త్వరలోనే వీరికి బిల్లులు వస్తాయి. పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం. బిల్లుల చెల్లింపుల్లో కొంత ఆలస్యమైంది. వారం రోజుల్లో బిల్లులు చెల్లించేలా చూస్తాం. పనులను త్వరితగతిన పూర్తిచేస్తాం.

– ఇనాయతుల్లా, ఏఈ, పంచాయతీరాజ్, ముస్తాబాద్

సమాచారం

నేడు మండల సర్వసభ్య సమావేశం

వేములవాడరూరల్: నేడు వేములవాడ రూరల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బండ మల్లేశం అధ్యతన గురువారం సమావేశం నిర్వహించనుండగా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

నియామకం

కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యవర్గం

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్ హుస్సెన్, బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవిందర్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడిగా మహమ్మద్ అహ్మద్‌ను, కాంగ్రెస్ పార్టీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా శ్రీరాములు వెంకటేశంకు నియమాక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజ్, నాయకులు రియాజుద్దిన్, పర్వీజ్ సానియా, వెంగళ అశోక్, శ్రీనివాస్, దేవదాస్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి మండల కార్యవర్గం

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండల అధ్యక్షుడిగా షేక్ ఇక్బాల్, ఉపాధ్యక్షుడు ఖురేషి మహమ్మద్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హనీఫ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మహమ్మద్ సలీంను నియమిస్తూ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎస్‌కే.సాహెబ్, పీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, తంగళ్లపల్లి అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని), మునిగెల రాజు, గడ్డం మధుకర్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం గ్రామ కార్యవర్గం

కోనరావుపేట: మండలం నిజామాబాద్ గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఈర్ల రవీందర్, ఉపాధ్యక్షుడిగా ఇప్ప శ్రీనివాస్, కోశాధికారిగా ఈర్ల నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా ఈర్ల తిరుపతి, సలహాదారులుగా దుగ్గ నారాయణ, మల్లేశం, లక్ష్మణ్, ఈర్ల పర్శరాములు, మహేందర్, రవీందర్, రాజు ఎన్నికయ్యారు.

పోలీసులు ప్రజల కోసమే పనిచేస్తున్నారు

- సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్


మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్

ముస్తాబాద్: పోలీసులు ప్రజల కోసమే పనిచేస్తున్నారని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండలంలోని మద్దికుంటలో ఎస్సై శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అనునిత్యం పనిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వివరాలు అడిగితే ఇవ్వవద్దన్నారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా వుండాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు ఇటీవల యువత బానిసలవుతున్నారని, ఇలాంటి వారిని ముందే గుర్తించి కౌన్సెలింగ్‌తో చికిత్సలు అందించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని 100 డయల్ చేసి తెలియజేయాలన్నారు. సర్పంచ్ భాగ్యశ్రీ, ఉపసర్పంచ్ భూమయ్య, ఎస్సై శేఖర్, ఏఎస్సై వెంకటరమణ, హెచ్‌సీలు భూమయ్య, బాలనర్సయ్య, పీసీలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న శ్రీసీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ ట్రస్టు నుంచి రూ.70 లక్షలు మంజూరుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అంకారపు అనిత, ఎంపీటీసీ కోడి అంతయ్య, ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ వెంకటరమణారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బండి జగన్, మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, కోడం సంధ్యారాణి, సద్ద శోభ, షాహేద బేగం, ఆసాని శ్రీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు రెడ్డి పరుశరాములు, లక్ష్మారెడ్డి, నాయకులు నులుగొండ శ్రీనివాస్, హైమద్, అనిల్ గౌడ్, కనకరాజు పాల్గొన్నారు.

రుణమాఫీ చేసినందుకు..

ముస్తాబాద్: లక్ష రూపాయల రుణమాఫీ చేసిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి రామలక్ష్మణపల్లెలో రైతులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రూ.లక్ష రుణాలను మాఫీ చేయడం హర్షనీయమన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తూ రుణమాఫీ చేసిన ఘనత సీఎంకు దక్కుతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు రైతులు రుణపడి వుంటారన్నారు. సర్పంచ్ దమ్మ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, కొటగిరి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.


రామలక్ష్మణపల్లెలో..

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

- టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేశ్


మాట్లాడుతున్న కటకం రమేశ్

గంభీరావుపేట: ఉద్యోగుల వేతన సవరణ కమిషన్, తాత్కాలిక భృతి త్వరలో ఇవ్వనున్నట్లు ప్రభుత్వం శాసనసభలో ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అలాగే ఐఆర్ కూడా ప్రకటించాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం గంభీరావుపేట మండలంలో పర్యటించి మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతునలు, దీర్ఘకాలిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. బదిలీ, పదోన్నతి ఖాళీలలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసాద్‌గౌడ్, మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధానకార్యదర్శి బాలకిషన్, జిల్లా కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్షలు


నిరాహార దీక్షలో పాల్గొన్న రెండో ఏఎన్‌ఎంలు

సిరిసిల్లటౌన్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం రిలే దీక్ష చేపట్టారు. జిల్లాలోని దాదాపు 60 మందికి పైగా ఏఎన్‌ఎంలు ఈ రిలేదీక్షలో పాల్గొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంహెచ్ఎస్ఆర్బీ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దుచేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జవేణు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు

తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్‌మిషన్ విభాగంలో పలురకాలుగా విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్‌నర్స్, ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎన్‌హెచ్ఎం ల్యాబ్‌టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీధర్ రావుకు సమ్మె నోటీసులు అందించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిని నిరసిస్తూ రాష్ట్రకమిటీ పిలుపుతో 17వ తేదీ నుంచి తమ సేవలను నిలిపివేస్తున్నామని సమ్మె నోటీసు అందించారు.

వాజ్‌పాయ్‌కి నివాళి


బోయినపల్లి: నివాళి అర్పిస్తున్న నాయకులు

బోయినపల్లి: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ వర్ధంతిని మండల కేంద్రంలో బుధవారం మండల బీజేపీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ ఉదారి నర్సింహాచారి, నాయకులు సారంపల్లి రాజు, సుంకపాక ప్రభు, బోగోజి గంగాధర్‌చారి, రాజూరి కిరణ్, కిరణ్, అనీల్, రజనీకాంత్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య


పరామర్శిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో వివిధ కారణాలతో మరణించిన రెండు బాధిత కుటుంబాలను మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రభుత్వపరంగా ఆదుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గ్రామానికి చెందిన ఏర్పుల సురేశ్ అనుమానస్పదంగా మృతి చెందగా, కిషన్‌దాస్‌పేటకు చెందిన రొడ్డ చంద్రయ్య అనారోగ్యంతో మరణించగా ఈ రెండు కుటుంబాల సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన కుటుంబ పోషణకర్తలు మరణించడం బాధకరమన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న సురేశ్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. పార్టీ, ప్రభుత్వపరంగా రెండు కుటుంబాలకు ఆర్థికంగా చేయూత నందిస్తామన్నారు. ఆయన వెంట నాయకులు పందిర్ల పర్శరాములుగౌడ్, ఎడ్ల సందీప్, ఎడ్ల లక్ష్మణ్, శివరామకృష్ణ, కల్యాణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మాజీ సర్పంచుల దీక్ష

సిరిసిల్లఅర్బన్: మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని చేపడుతున్న నిరహార దీక్ష 8వ రోజుకు చేరింది. మాజీ సర్పంచుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మచ్చ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం మాజీ సర్పంచుల సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య, సంపూనారి మల్లేశం గౌడ్, సతీశ్‌రావు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

జీవశాస్త్రం ఉపాధ్యాయుడిని నియమించాలి

ఎల్లారెడ్డిపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడిని నియమించాలని మాజీ ఎంపీటీసీ, విద్యా కమిటీ చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ బుధవారం ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. 2020లో జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు ముత్యాల వెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేసిన అనంతరం రెండేళ్లు విద్యా వలంటీర్‌తో బోధించడం జరిగిందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. మండలంలోని ఏదైనా పాఠశాలలో జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు అదనంగా ఉంటే ఇక్కడి పాఠశాలకు కేటాయించాలని కోరారు.

వైస్ ప్రిన్సిపాల్‌కు సన్మానం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తిరుకొవెల శ్రీనివాస్‌కు ఇటీవల అంతర్జాతీయ స్థాయి ఉత్తమ పరిశోధన పురస్కారం రావడంతో అయనను పూర్వ విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు జయవర్ధన్, అధ్యాపకులు మల్లారెడ్డి, మధు రాజేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంగన్‌వాడీ టీచర్‌పై దాడి అమానుషం

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ అంగన్‌వాడీ టీచర్ లక్ష్మిపై ఉపసర్పంచ్ వరలక్ష్మి అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి మూసం రమేశ్, మండల కార్యదర్శి గురజాల శ్రీధర్ అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం నిరసన తెలిపిన అనంతరం వారు మాట్లాడుతూ అధికార పార్టీ వారే దాడులు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు అంగన్‌వాడీ టీచర్లకు భద్రత కల్పించాలని కోరారు. బాధిత అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, రామంచ అశోక్, ఎలిగేటి రాజశేఖర్ ఉన్నారు.

22న జిల్లా స్థాయి కళాకారుల సదస్సు

సిరిసిల్లకల్చరల్: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా సినారె కళామందిరంలో జిల్లా స్థాయి కళాకారుల సదస్సు ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తీగల రాజేశం, బొమ్మెన రవితేజ ప్రకటనలో తెలిపారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో ఇటీవల మృతి చెందిన గీత కార్మికుడు ఈదుగురాళ్ల కిషన్‌గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని గౌడ సంఘం జిల్లా కార్యదర్శి కొండ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మృతుడి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు.

ఎస్సైగా ఎంపికైన యువకుడికి సన్మానం

చందుర్తి: ఎస్సైగా ఎంపికైన మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన జవ్వాజి అరుణ్‌కుమార్ గౌడ్‌ను గౌడ సంఘం మండల యూత్ అధ్యక్షుడు మల్యాల రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం సర్పంచ్ కొత్తపల్లి వాణి పంపిణీ చేశారు.

బోరుబావికి భూమిపూజ

రుద్రంగి: మండలంలోని మానాల గ్రామంలో బుధవారం రుద్రంగి జెడ్పీటీసి గట్ల మీనయ్య, వైస్‌ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి భూమిపూజ చేశారు.

ఉద్యమకారులను కలిసిన ఓరుగంటి

ఇల్లంతకుంట: ఉద్యమ కాలంలో తనతో కలిసి పనిచేసిన రహీంఖాన్‌పేట, వెల్జిపూర్, అనంతారం, ఎర్రనర్సుపల్లి గ్రామాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ ఇంటింటికి వెళ్లి కలవడంతో పాటు శాలువాలతో సన్మానించారు.

పల్లెపల్లెకు రాజ్యాంగం


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: ఓటు హక్కు విశిష్టతను వివరిస్తూ బహుజన భీమ్ రామస్వామి తెలంగాణ పెరియార్ (వాయిస్ ఫర్ గరీబ్) ముద్రించి ప్రచార కరపత్రాన్ని మండల కేంద్రంలో పలువురు నాయకులు బుధవారం విడుదల చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు పెరియార్ రామస్వామి, ఉపేంద్ర, రాజు, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఎక్కడ?

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోగా, ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందకుండా చేస్తుందని బహుజన సమాజ్ పార్టీ మండల ఇన్‌చార్జి లింగాల సందీప్ అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ రేషన్ కార్డులుంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులు అనడం విడ్డూరంగా ఉందన్నారు. లక్షలాది మంది సంక్షేమ పథకాలు బీసీ బంధు, గృహలక్ష్మి, పెన్షన్లు అన్నింటికీ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరి అని పెట్టి కార్డులు మంజూరు చేయకుండా పథకాలు అందకుండా చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు కొప్పెల్లి రాజు, నాగరాజు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి



ఎల్లారెడ్డిపేట: మండలం దుమాలలో బుధవారం మురుగు నీటి కాలువల్లో పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లుతూ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కదిరె రజిత మాట్లాడుతూ గత సీజన్‌లో గ్రామంలో తీవ్రమైన జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఆ పరిస్థితులు పునారావృతం కాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టామన్నారు.